క్లుప్తంగా

14న ఇంటర్ ప్రవేశాలకు కౌన్సెలింగ్

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్‌లో రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ఈ నెల 14న స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ జరగనున్నట్టు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 14న ఉదయం పది గంటలకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

ప్రసవ సమయంలో గర్భిణులు ఆస్పత్రుల్లో చేరాలి


గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శిరీష

సీతానగరం: ప్రభుత్వాసుపత్రుల్లోనే గర్భిణులు ప్రసవ సమయానికి చేరాలని సీతానగరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శిరీష కోరారు. పీహెచ్‌సీలో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుండి ప్రభుత్వం సమకూర్చిన పౌష్టికాహారాన్ని నిర్దేశించిన అంగన్‌వాడీ కేంద్రాల్లో తీసుకోవాలని సమీపంలోఉన్న పీహెచ్‌సీ లేదా ఫ్యామిలీ ఫిజీషియన్ 104 సంచార వైద్య కేంద్రంలో మందులు తీసుకోవాలన్నారు. గర్భిణుల్లో ఐరన్ లోపం ఎక్కువగా ఉంటుందన్నారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఏపీడీ సత్యంనాయుడు

సాలూరు: డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని ఐటీడీఏ ఏపీడీ సత్యంనాయుడు అన్నారు. వెలుగు కార్యాలయంలో వెలుగు అధికారులు, సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. పీఎంఈజీపీ రుణాలు, స్త్రీనిధి ద్వారా బ్యాంకు లింకేజి రుణాల చెల్లింపులు, నూతన రుణాలు మంజూరు తదితర అంశాలపై ఆరా తీశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని సూచించారు. సమావేశంలో డీపీఎం అప్పారావు, ఏపీఎంలు సింహాచలం, జయమ్మ, జయకుమార్, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోనే ఉపాధి

రేగిడి: ఉన్న ఊరిలోనే ప్రభుత్వం ఉపాధి కల్పిస్తోందని ఉపాధి హామీ పథకం ఏపీఓ ఎస్.హరనాథ్ అన్నారు. కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు 272 రూపాయల వేతనం గిట్టుబాటు అవుతుందని చెప్పారు. మండల పరిధిలోని లచ్చారాయపురం గిరిజాలవాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాబ్‌కార్డు ఉన్నవారు మాత్రమే ఉపాధి పనులకు రావాలన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి..

రాజాం: కొలతల ప్రకారం పనులు చేస్తే వేతనదారులకు రోజుకు 270 రూపాయల వరకు వేతనం గిట్టుబాటు అవుతుందని ఎంపీడీఓ బాసూరి శంకరరావు తెలిపారు. మండలంలోని ఒమ్మి, రాజయ్యపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మస్తర్లు తనిఖీ చేయడంతో పాటు వేతనదారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత


బాధితుడికి నగదు అందిస్తున్న గ్రామపెద్దలు

రాజాం: మండలంలోని కంచరాం గ్రామానికి చెందిన బత్తిన రాము అనే మహిళ ఈ నెల 8న మృతి చెందగా... ఆమె కుమారుడు రమేష్‌కు వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా రూ. పది వేల తక్షణ సాయాన్ని శుక్రవారం అందజేశారు. సర్పంచ్ గెద్దాపు సుబ్బమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు గెద్దాపు అప్పలనాయుడు చేతులమీదుగా నగదు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దిలీప్‌కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ హైమ, వలంటీర్లు లక్ష్మీ, సాయి, గ్రామస్తులు భాస్కరరావు, రాంబాబు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రేగిడి: గ్రామాల్లో వ్యాధుల ప్రబలకుండా సర్పంచ్‌లు, సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా వన్నలి, ఉప్పరనాయుడువలస, చాటాయవలస, చిన్నశిర్లాం, తదితర గ్రామాల్లో శుక్రవారం కాలువలను శుభ్రం చేయడంతో పాటు రోడ్లకిరువైపులా బ్లీచింగ్ పిచికారీ చేశారు.

అర్హతే ప్రామాణికంగా
ప్రభుత్వ సంక్షేమ ఫలాలు


సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. పార్వతీపురం పట్టణం 13, 25 వార్డుల్లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గత 6 రోజులుగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం పూర్తి చేశారు. ప్రతీ ఒక్క గడపకు వెళ్లి కుటుంబాలను కలుసుకొని వారికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు అందుతున్న తీరును స్వయాన అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరికైనా, ఏ ఒక్క ప్రభుత్వ పథకం రాకపోయినా, ఆ విషయాన్ని సైతం తెలుసుకున్నారు అధికారులచే నమోదు చేయించారు.

మున్సిపాలిటీలో సక్సెస్

పార్వతీపురం మున్సిపాలిటీలో 30 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. గడప గడపన గుర్తించిన ప్రతి ఒక్క సమస్యను వారిని అడిగి తెలుసుకుని, సమస్యల వారీగా విభజించి ఆయా శాఖల వారీగా గుర్తించిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సకాలంలో పరిష్కారం అయ్యేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మున్సిపల్ స్థాయి గృహ నిర్మాణ శాఖ అధికారులను సైతం పిలిపించి అర్హత గల ప్రతి ఒక్క లబ్ధిదారునికి ఇల్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రభుత్వ పథకాలను పక్కాగా లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. ప్రతి ఒక్క లబ్ధిదారునికి మేలు జరిగేలా, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధానం మరింత బలపడేలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, యిందుపూరు గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, ఎక్స్ వైస్ చైర్మన్ బెలగాం జయబాబు, ఏఎంసి వైస్ చైర్మన్ వి.శంకర్రావు, స్థానిక కౌన్సిలర్ సభ్యులు త్రినాథ, ఆర్.చిన్నంనాయుడు, ఆర్.బంగారు నాయుడు, నిమ్మకాయల సుధీర్, కోరాడ శ్రీనివాస రావు (నాని), పి.జయంతి, ఎస్.లావణ్య, జేసీఎస్ కన్వీనర్ జి.మాధవరావు, స్టేట్ డైరెక్టర్లు చెవిటి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సచివాలయం కన్వీనర్లు ఆర్వీఎస్ కుమార్, ఎం.తవిటి నాయుడు, గండి భాగ్యవతి, ఎ.విజయ, సామల లలిత, బొంగు సురేష్, బి.నగేష్, కె.చిట్టి, ఎస్.చంద్రరావు, పి.శ్రీనివాసరావు, కార్యకర్తలు, గృహ సారథులు, మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.


కార్యక్రమం పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

అందుబాటులో ఖరీఫ్ విత్తనాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఏ అవినాష్

సీతానగరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువులు ఆర్‌బీకేల్లో పంపిణీ చేసేందుకు అందుబాటులో సిద్ధంగా ఉన్నాయని ఏఓ ఎస్.అవినాష్ వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ అధ్యక్షతన మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో ఏఓ మాట్లాడుతూ జిరాయితీ రైతుల నుంచి భూములను కౌలు చేస్తున్న రైతులు రెవెన్యూ శాఖ నుంచి గుర్తింపు కార్డులు తీసుకోవాలని సూచించారు. రానున్న ఖరీఫ్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటికే గోదాంలో 210 మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువు నిల్వలు ఉన్నాయన్నారు. అదే స్థాయిలో యూరియా కూడా ఉందన్నారు. తహసీల్దార ఎన్వీ రమణ మాట్లాడుతూ భూములను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న రైతులు అర్జీలు చేసుకుంటే వారికి కౌలురైతు ధ్రువపత్రాలు ఇస్తామన్నారు. ఇప్పటికే 175 మంది రైతులకు ఈ పత్రాలు జారీ చేశామన్నారు. నవధాన్యాల సాగుతో రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కమల అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతి, ఆర్ఐ నాగిరెడ్డి శ్రీనివాసరావు, సలహా కమిటీ సభ్యులు పీపీ తిరుపతిరావు, బక్కు సూర్యనారాయణ, వై.శ్రీనివాసరావు ,ఆర్.అచ్చుతరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్ సీట్లు పెంచండి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన బాలురు, బాలికల గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో ప్రస్తుతం ఉన్న సీట్ల సంఖ్యను పెంచాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పల్ల సురేష్, కార్యదర్శి సీతారాం, గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఒక్కో గ్రూపులో ఇప్పుడు 40 సీట్ల చొప్పున భర్తీ చేస్తున్నారని, అదనంగా మరో 20 సీట్లు కేటాయిస్తే మరికొంతమందికి చదువుకునే అవకాశం కల్పించినట్లు అవుతుందని తెలిపారు. ఐటీడీఏ పీఓ స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

- డీఎస్పీ జి.వి.కృష్ణారావు


ప్రమాదాల నివారణకు సూచనలు చేస్తున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు సూచించారు. స్థానిక పట్టణంలోని శ్రీవిజయ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మీటింగ్ హాల్‌లో ఐరడ్(ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటాబేస్)పై పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలకు అధికారులు నేరుగా వెళ్లి, ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవాలని డీఎస్పీ సూచించారు. మరోసారి అదేచోట ప్రమాదం పునరావృతం కాకుండా చూడాలన్నారు. దీనికి సంబంధించిన రికార్డు వర్క్ కూడా పూర్తిగా కాగిత రహితం కావాలని, పూర్తి సమాచారం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. ప్రమాదాలు జరిగే చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో సీఐ మురళీధర్, ఎస్ఐలు, ఆర్ అండ్ బీ, మోటార్ వెహికల్, పంచాయతీరాజ్, వైద్యా రోగ్యశాఖ, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం


జగనన్న కాలనీలో హౌసింగ్ డే నిర్వహిస్తున్న అధికారులు

రాజాం సిటీ: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు సూచించారు. మండల పరిధి కంచరాం సమీపంలో పట్టణ పేదలకు కేటాయించిన జగనన్న కాలనీలో శుక్రవారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరితగతిన పనులు పూర్తి చేసి సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాలని సూచించారు. కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు


ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కన్నపుదొర గ్రామ పంచాయతీ పరిధిలోని సుభద్రమ్మవలస గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, ప్రతీ ప్రాంతంలో అక్కడి ప్రజలు కోరుకున్న అభివృద్ధి పనులు చేయడంతో పాటు పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా ఆ పార్టీ జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అర్హులై ఉండి, సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే చాలని, పథకాలు, అభివృద్ధి పనులు మంజూరవుతున్నాయన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మూడడ్ల శశికళ, వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్, ఏపీఎంఎస్ఎంఈ డైరెక్టర్ మూడడ్ల గౌరీశంకరరావు, సర్పంచ్ రెడ్డి అన్నపూర్ణమ్మ, ఎంపీటీసీ రెడ్డి రవికుమార్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం:

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వారు ఖరీఫ్ సాగుకు సంబంధించి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉంచామన్నారు. నియోజకవర్గంలోని 93 ఆర్‌బీకేల్లో 5,690 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిలో 3,661 క్వింటాళ్ల విత్తనాలను 10 శాతం రాయితీపై, 2,029 క్వింటాళ్ల విత్తనాలను గిరిజనులకు 90 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పథకం ద్వారా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతోందన్నారు. అనంతరం పలువురు రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు, ఎరువులను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కలిసి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, వ్యవసాయశాఖ ఏడీ రత్నకుమారి, ఎంపీడీఓ జయంత్‌ప్రసాద్, ఏఓ జె.సౌజన్య, పీఏసీఎస్ డైరెక్టర్ భోగి మణి తదితరులు పాల్గొన్నారు.


రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యత


కేఎస్ పురంలో అమృత్ సరోవర్ చెరువు శిలాఫలకం వద్ద ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర ప్రత్యేక అధికారి మల్లికార్జునరావు

సీతానగరం: ప్రభుత్వం గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు గ్రామాన్ని ఆనుకుని ఉన్న చెరువులను అమృత్ సరోవర్ పథకం ద్వారా పచ్చని వాతావరణంతో కూడిన అభివృద్ధి చేయడానికి ప్రాధాన్యతనిచ్చిందని రాష్ట్ర అమృత్ సరోవర్ చెరువుల తనిఖీ ప్రత్యేక అధికారి డి.మల్లికార్జునరావు అన్నారు. కె సీతారాంపురం, అప్పయ్యపేట గ్రామాల్లో అమృత్ సరోవర్ పథకం ద్వారా జరుగుతున్న చెరువుల అభివృద్ధి పనులను డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్‌తో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని ఆనుకుని ఉన్న చెరువులో పనులకు రూ. 12 నుండి 15 లక్షలతో అభివృద్ధి చేసేందుకు నిర్ణయించిందన్నారు. చెరువు గట్లపై కూరగాయలు, ఫలజాతి మొక్కలు పెంచడం ద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చేలా ప్రాధాన్యత కల్పించిందన్నారు. సీతానగరం మండలంలో జానుమల్లువలస, కెఎస్ పురం, జోగింపేట, అంటిపేట, కృష్ణారాయపురం, సూరంపేట గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా అమృత్ సరోవర్ చెరువులు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఉడమల జయలక్ష్మి, జె.తేరేజమ్మ, ఎంపీటీసీలు బి.కుసుమ, వై.అరుణకుమారి, ఉపాధి హామీ పథకం ఏపీఓ భాను, జేఈ బీవీ కృష్ణారావు, టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించండి


ఇంటర్‌లో ప్రవేశానికి విద్యార్థి తండ్రి నుంచి ప్రవేశ దరఖాస్తు తీసుకుంటున్న అధ్యాపకులు

సీతానగరం: ఇంటర్ చదవాల్సిన విద్యార్థులు మౌలిక సదుపాయాలున్న స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరాలని కోరుతూ అధ్యాపకులు లక్ష్మీపురం, చెల్లన్నాయుడువలస గ్రామాల్లో పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్లకు శుక్రవారం వెళ్లి అవగాహన కల్పించారు. సీతానగరం మండల కేంద్రంలో విద్యాబోధనకు, ప్రాక్టికల్స్ నిర్వాహణకు, రాకపోకలు సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులు చేరాలని కోరారు. ప్రిన్సిపాల్ బి.రేణుక పర్య వేక్షణలో అధ్యాపకులంతా టీంలుగా ఏర్పడి సీతానగరం, బలిజిపేట, మక్కువ, పార్వతీపురం మండలాలకు చెందిన గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. అధ్యాపకులు టి.రవికుమార్, రామారావు, డి.రామకృష్ణ అరుణ్‌కుమారి అమ్మాజీ, నవీన్, వినోద్,అచ్చంనాయుడు, రమేష్, మోహన్‌రావు, వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతీ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ తిరుమలప్రసాద్

పార్వతీపురం టౌన్: ప్రతీ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో నెలకు రెండుసార్లు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వైద్యాధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. మండలంలోని గోపాలపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గర్భిణులకు, వృద్ధులకు, చిన్నారులకు వైద్యపరీక్షలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతీ నెలకు రెండుసార్లు నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందుబాటులో 62రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు మందులను అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లో మంచాన పడి వున్న రోగుల వద్దకు వెళ్లి ఇళ్ల వద్దనే వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచిస్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

విస్తరణ పనులు వేగవంతం చేయాలి


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సుధాకర్

రాజాం సిటీ: రాజాం మెయిన్ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని మున్సిపాల్టీ, మండల ప్రత్యేకాధికారి సుధాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మున్సిపల్, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారులంతా సమన్వయంతో పనిచేసి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి వివాదాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే స్పందనలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం నాడు - నేడు పనులు, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణంరాజు, కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మేనేజర్ ఎంవీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువుతో భూసారం


పచ్చిరొట్ట ఎరువులపై అవగాహన కల్పిస్తున్న ఏఓ మురళీకృష్ణ

రేగిడి: పచ్చిరొట్ట ఎరువుల ద్వారా నేల సారవంతంగా ఉంటుందని మండల వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండల పరిధిలోని చాటాయివలస పీఎండీఎస్ క్రాప్ కటింగ్ కార్యక్రమంపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పచ్చిరొట్ట ఎరువులతో పాటు పప్పు గింజలకు సంబంధించి 18 రకాల విత్తనాలు దమ్ములకు ముందు పొలాల్లో వేయడం వల్ల నేలకు మంచి సత్తువ వస్తుందని చెప్పారు. కిలో పచ్చిరొట్ట ఎరువు వంద కిలోల పశువుల ఎరువుతో సమానమని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ కెంబూరు శ్రీనివాసరావు, సర్పంచ్ కరణం గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేని విత్తనాలు కొనవద్దు..

మార్కెట్‌లో గుర్తింపు లేని వరి విత్తనాలు ఉన్నాయని, వాటిని కొనుగోలు చేసి మోసపోవద్దని మండల వ్యవసాయ శాఖాధికారి జి. మురళీకృష్ణ అన్నారు. మండలంలోని పోరాం, ఉణుకూరు, కాగితాపల్లి, తదితర గ్రామాల్లో వ్యవసాయ అవగాహన సదస్సులు నిర్వహించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాల కోసం రైతుభరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.